ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023 8 పేజీలు




గుంటూరు పల్నాడు

96 వేల ఎకరాలు ఖాళీ

- ముగిసిన రబీ సాగు సమయం
- పల్నాడులో తగ్గిన వరి-డెల్టాలో పెరిగిన మొక్కజొన్న
- ఆరుతడికి పూర్తిగా ఆసక్తి చూపని రైతులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రబీ సీజన్ సాగు ముగిసింది. అయినా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 96 వేల ఎకరాల వరకూ ఇప్పటికీ పంటలేమీ సాగవకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేయాల్సి ఉండగా 1.32 లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. పల్నాడు జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా కేవలం 90 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. గుంటూరు జిల్లాలో 2700 ఎకరాలకు గాను 1150 ఎకరాల్లోనే వరి సాగు చేశారు. పల్నాడు జిల్లాలో రబీ సాగుగా 69 వేల వరి సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 28 వేల ఎకరాల్లోనే వరి సాగు చేశారు. జలాశయాల్లో నీరు పుష్కలంగా వున్నా వరి సాగు తగ్గడం గమనార్హం. పల్నాడు జిల్లాలో దాదాపు 41 వేల ఎకరాల్లో వరి సాగు చేయలేకపోయారు. వరి సాగులో ఆదాయం కంటే కనీస పెట్టుబడులైనా రాని పరిస్థితిలో రైతులు విసిగి ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలోనూ వరి సాగుకు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

కృష్ణా డెల్టా పరిధిలో ఆశించిన స్థాయిలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర సాగు పెరగలేదు. కృష్ణా డెల్టా పరిధిలో వరి కోతలు పూర్తయిన వెంటనే జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలను సాగు చేయాల్సి ఉండగా ఈసారి ఎక్కువ మంది ఈ 2లో



గుంటూరు జిల్లా కాకుమాను మండలంలోని అప్పాపురం - రేటూరు గ్రామాల మధ్య ఖాళీగా ఉన్న పొలాలు



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పక్కన డి.రమాదేవి, మాల్యాద్రి తదితరులు

పెచ్చరిల్లుతున్న భూ మాఫియా ఆగడాలు

- లంక గ్రామాల్లో దళితులపై పెత్తందారుల దాడే నిదర్శనం
- పెత్తందార్లకు కొమ్ముగాస్తున్న అధికార పార్టీ
- దాడికి గురైన దళితులపైనే నాన్‌బెయిలబుల్ కేసులు
- ప్రభుత్వం పేదల పక్షమా? పెత్తందారుల పక్షమా? సిఎం చెప్పాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రంలో భూమాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వేల ఎకరాలు వారి కబంధ హస్తాల్లోకి వెళ్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంక ,పెదలంక, చింతల్లంక గ్రామాల్లో ఇటీవల ఆర్సి భూములు సాగు చేస్తున్న దళితులపై పెత్తందారులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెనాలికి ఆదివారం వచ్చిన ఆయన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా భూమాఫియా కొనసాగుతోందని, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, ఫారెస్ట్ భూములు, గ్రామకంఠాలు, కాల్వ కట్టలు, చెరువుగట్లులన్నింటినీ కార్పొరేట్లు, భూ మాఫియాలు లాక్కుంటుంటే వారికి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని విమర్శించారు. జగనన్న కాలనీలకు కేటాయించిన భూముల్లో ఎక్కువ శాతం అసైన్డ్ భూములేనని, సరైన పరిహారమూ పేదలకు ఇవ్వకుండా ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న వారికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌సి భూములు సాగు చేసుకునేందుకు ప్రభుత్వమే అవకాశం కల్పించిందని, ఇప్పుడు పెత్తందారులు ఆక్రమిస్తుంటే చోద్యం చూస్తోందని మండిపడ్డారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక, పెద్దలంక, గాజుల్లంక పరిధిలో ఉన్న ఆర్‌సి భూములను అక్కడి దళితులు దీర్ఘకాలికంగా సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే వారి ఉనికిని సహించలేని పెత్తందారులు ఇటీవల వారిపై దాడి చేసి అంతమొందించేందుకు యత్నించారని, అయినా వారిపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇదే క్రమంలో దాడికి గురైన పేదలపై 2లో

సొసైటీలకు అనుబంధంగా గిడ్డంగులు

- నాబార్డు ఆర్థిక సహకారంతో నిర్మాణం
- ఆర్‌బికెలకు అనుసంధానంతో మల్టీపర్పస్‌గా వినియోగం
- 275 కేంద్రాల్లో జగనన్న పాలవెల్లువ
- ప్రజాశక్తితో పల్నాడు డిసిబి నాగశ్రీనివాస్

8లో

గ్రామాల్లో అభివృద్ధి పనులు లేవు

- మూడేళ్లయినా ప్రారంభమవ్వని పనులు
- మార్చి నాటికి ప్రారంభించకుంటే రాజీనామా

5లో



నరసరావుపేటలో డిఇఒ కార్యాలయం ఎదుట దీక్షలో ఉపాధ్యాయులు, నాయకులు

- గుంటూరు, నరసరావుపేటలో యుటిఎఫ్ నిరసన దీక్షలు
- ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్

హామీని అమలు చేయాలంటే అరెస్టులా..

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

ప్రజల సాక్షిగా పాదయాత్రలో సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేస్తానని సిఎం ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగితే అరెస్ట్ చేయటం, కేసులు పెట్టటం అప్రజాస్వామికమని యుటిఎఫ్ నాయకులు మండిపడ్డారు. సంకల్ప దీక్షను అడ్డుకోవటాన్ని నిరసిస్తూ గుంటూరులో కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆదివారం నిరసన దీక్షలు చేపట్టింది. గుంటూరు దీక్ష శిబిరంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎఎన్.కుసుమ కుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ 5వ తేదీ వచ్చినా జీతాల ఆచూకీ లేదని, నాలుగేళ్లలో సక్రమంగా ఒక్క డిఎ కూడా ఇవ్వలేదని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించటం మానుకోవాలన్నారు. తనిఖీల పేరుతో 2లో



గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో ఉపాధ్యాయులు, నాయకులు



ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, మంత్రి

కలుషిత నీటివల్లే విద్యార్థినులకు అస్వస్థత

- ఆహారం కలుషితమైనట్లు నిర్ధారణ కాలేదు
- పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- రామకృష్ణాపురం గురుకులంలో మంత్రి రాంబాబుతో కలిసి పరిశీలన

వార్త మెయిన్‌లో

రూ.కోటి స్థలం కబ్జా

3లో

పెచ్చరిల్లుతున్న భూ మాఫియా ఆగడాలు

(మొదటి పేజీ తరువాయి)

నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారని, పెత్తందారులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని దుయ్యబట్టారు. పేదలకు అండగా నిలబడ్డ సిపిఎం మండల కార్యదర్శి సురేష్‌పైనా కేసు పెట్టి జైల్లో వేశారన్నారు. ఆయా భూములపై ఇక్కడి మంత్రి గతంలో ఇచ్చిన హామీ మేరకే భూముల్లోకి దళితులు వెళ్లారని, ఇప్పుడు మంత్రి మాట తప్పి పెత్తందార్ల కొమ్ము కాస్తున్నారని, నమ్మి ఓట్లేసిన పదేలకు నిలువునా వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. దీనిపై దీనిపై మంత్రి బహిరంగంగా మాట్లాడాలన్నారు. రాష్ట్రంలో పేదలు, ధనికుల మధ్య పోటీ అంటూ చెప్పిన సిఎం దీనిపై నేరుగా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కోనేరు రంగారావు కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రీన్ ఎనర్జీ పేరిట 75 వేల ఎకరాలు ఆదానీకి ప్రభుత్వం కట్టబెట్టిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పేదల పక్షమా, పెత్తందారుల పక్షమా? అని నిలదీశారు. పేదల పక్షమైతే వారి నుంచి లాక్కున్న భూములను తిరిగి వారికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల నుండి లక్షల ఎకరాల భూములు ఇలా లాక్కుంటూ మరోవైపు వారికి జగనన్న కాలనీల్లో పేదలకు సెంటు మాత్రమే ఎరవేసినట్లుగా ఇచ్చారని అన్నారు. ఇందులోనూ రూ.లక్షా 80 వేలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని, ఆయా కాలనీల్లో ఇప్పటికీ ఏడెనిమిది శాతం మందే ఇళ్లు నిర్మించుకోవడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఇంటి నిర్మాణానికి కనీసం రూ.ఐదారుల లక్షలవుతుందన్నారు. వీటన్నింటి దృష్ట్యా పేదలకు కనీసం మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి రాయితీపై రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ పేదలపై పెత్తందారులు దాడులకు పాల్పడుతుంటే స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న, దళిత సామాజిక తరగతికి చెందిన మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. హత్యాయత్నం చేసిన వారిపై 307, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేయాల్సిన పోలీసులే వారికి అండగా నిలుస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష టిడిపి, పేదల పక్షమని చెప్పుకుంటున్న జనసేన పార్టీకూడా దళితులపై దాడిని ఖండించకపోవడం, దానిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. బాధిత వర్గాలకు సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కొల్లూరు మండలంలో దళితులపై పెత్తందారులు చేసిన దాడులే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, కెవిపిఎస్ బాపట్ల జిల్లా కన్వీనర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

96 వేల ఎకరాలు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

పంటలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. జిల్లాలో 1.67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా అదే స్థాయిలో ఆరతడి పంటలు సాగు అవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 80 శాతం విస్తీర్ణంలోనే సాగైంది.

గుంటూరు జిల్లాలో 55 వేల ఎకరాల్లో జొన్న సాగు అవుతుందని అంచనా వేయగా 23 వేల ఎకరాల్లోనే చేశారు. మొక్కజొన్న 51 వేల ఎకరాలకు గాను కేవలం 60 వేల ఎకరాలు, ముతకధాన్యాలు లక్ష ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 82 వేల ఎకరాల్లోనే వేశారు. 25 వేల ఎకరాల్లో శనగ పంట వేయాల్సి ఉండగా 18 వేల ఎకరాల్లో, పెసర 26 వేల ఎకరాలకు గాను 20 వేల ఎకరాల్లో, మినుము 16 వేల ఎకరాలకు గాను 11 వేల ఎకరాల్లో వేశారు.

పల్నాడు జిల్లాలో జొన్నలు 1500 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా కేవలం 55 ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న 20 వేల ఎకరాలకు గాను 35 వేలు, ముతక ధాన్యాలు 22 వేల ఎకరాల్లో సాగు చేస్తారని భావించగా 35 వేల ఎకరాలు, శనగ 30 వేల ఎకరాలకు గాను 19 ఎకరాలు, పెసర 1500 ఎకరాలకు గాను కేవలం 230 ఎకరాల్లో, మినుము ఐదు వేల ఎకరాలకు గాను వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్‌లో ఏ పంటలూ వేయని పొలాలు రెండు జిల్లాల్లో కలిపి 1.30 లక్షల ఎకరాలు కాగా రబీలోనూ 96 వేల ఎకరాలు ఉండటం గమనార్హం. ప్రధానంగా కౌలు రైతులు రెండు పంటలకు కౌలు చేసుకునే వారే రబీ సాగు చేశారని తెలిసింది. సొంత పొలాలున్న వారు రెండో పంటగా జొన్న, మినుము, పెసర తదితర పంటల సాగుకూ ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది.

హామీని అమలు చేయాలంటే అరెస్టులా..

(మొదటి పేజీ తరువాయి)

మండల అధికారులు మొదలు జిల్లా, రాష్ట్ర అధికారులు చిన్న చిన్న కారణాలకు కూడా ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేస్తున్నారని విమర్శించారు. నరసరావుపేటలో దీక్ష శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర తొలి నుండి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తోందని, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు తమ ఉద్యోగులకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాయని, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వమూ ఇదే పని చేసిందని, పొరుగున ఉన్న తమిళనాడుకూ ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఓపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించిందని వివరించారు. మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం 1.85 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ స్థానంలో చట్ట బద్ధత, గ్యారంటీ లేని జిపిఎస్ అమలుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు ఎన్.సుందరరావు మాట్లాడుతూ ఒపిఎస్ అమలు సాధ్యమేనని, దీనికోసం అన్ని సంఘాలను కలుపుకొని ప్రజల మద్దతుతో ఉద్యమిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి సందర్శించి మద్దతు తెలిపారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని ఉద్యమాలను అణచేందుకు చూస్తోందని విమర్శించారు. గుంటూరు దీక్షలో సిపిఎస్ కన్వీనర్ శివపార్వతి, షకీలా, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి గయాసుద్దౌలా, కార్యదర్శులు సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, కె.రంగారావు, ఎం.గురుబ్రహ్మం పాల్గొన్నారు. నరసరావుపేట దీక్షలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జె.వాల్యానాయక్, కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాసరావు, కె.తిరుపతిస్వామి, డి కాంతారావు, ఎం.మోహన్‌రావు, కె.ఉషాసౌరీరాణి, వై.శ్రీనివాసరావు, ఎస్ఎమ్‌డి గఫార్, షేక్ జమాల్, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు, సిపిఎస్ కో-కన్వీనర్ టి.ఆనంద్ కుమార్, షేక్ ఫిరోజ్ బాషా, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, రాము, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక జెడ్పి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 1992 - 93 సంవత్సరం లో విద్యాభ్యాసం చేసిన 110 మంది విద్యార్థులలో 90 మంది వివిధ ప్రాంతాల నుంచి స్కూల్ వద్దకు చేరుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు చంద్ర శేఖర్, రంగారావు, కష్ణారావు లను శాలువాలతో సన్మానించారు. గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థిని కొమ్మినేని లక్ష్మి పాఠశాలకు 7 కంప్యూటర్ లను పాఠశాలకు బహుమతిగా ఇచ్చారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 870 మంది హాజరు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ అందించడమే ముఖ్య ఉద్దేశంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష ఆదివారం పట్టణంలో జరిగింది. మొత్తం 5 సెంటర్స్‌లో నిర్వహించిన పరీక్ష వివరాలను తెనాలి ఉప విద్యాశాఖాధికారి జి.నిర్మల వెల్లడించారు. డివిజన్‌లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు 930 మంది ఈ పరీక్షకు హాజరు కావాల్సి ఉందని, అయితే 870 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. పట్టణంలోని బాయ్స్ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్, ఎన్సిఆర్ఎం, టిఎస్ఆర్ఎం, కెఎస్ఎం మున్సిపల్ హైస్కూల్స్లో పరీక్ష జరిగిందన్నారు. ఎక్కడా అవాంతరాలు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించడం జరిగిందని రూట్ ఆఫీసర్ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు.



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మండ్రు చేసిన సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -మంగళగిరి

సంఘాన్ని భలోపేతం చేయడంలో మండ్రు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం పట్టణ పద్మశాలియ సంఘం మాజీ అధ్యక్షులు మండ్రు వెంకటేశ్వరరావు మృతికి సంతాపం తెలియజేస్తూ పట్టణ పద్మశాలి సంఘం కార్యాలయంలో సభ జరిగింది. ఈ సభకు సంఘం అధ్యక్షులు చింత క్రింది కనకయ్య అధ్యక్షత వహించారు. అనంతరం మండ్రు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు ఆర్ పూర్ణచంద్రరావు, వంగర పెద్ద లక్ష్మయ్య, వంగర కిషోర్, కొల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రాజధాని కోసం ఎన్నాళ్లైనా ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రాజధాని సాధన కోసం ఎన్నాళ్లైనా..ఎన్నేళ్లైనా..ఉద్యమాన్ని కొనసాగించి తీరుతామని రైతులు ఉద్ఘాటించారు. ఆదివారం తుళ్లూరు, అనంతవరం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు తదితర గ్రామాల్లో రైతులు, మహిళలు దీక్షా శిబిరాలు, ఇళ్ళ వద్ద చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి వీడి రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేయాలని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ రాజధానంటూ బాధ్యతారహితంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. అమరావతి ఉద్యమం ఆదివారంతో 1146 వ రోజుకు చేరింది.

నారా లోకేష్ క్రీడా ప్రాంగణం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బైపాస్ రోడ్డు కొండపనేని టవర్స్ ప్రక్కనే భోగి ఎస్టేట్స్‌లో క్రికెట్ ప్రాక్టీస్ నెట్, క్రికెట్ గ్రౌండ్, షటిల్, వాలీబాల్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నారా లోకేష్ సహకారంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంను టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య రిబ్బన్ కట్ చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు గ్రౌండ్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మిశెట్టి జానకి దేవి, పోతినేని శ్రీనివాసరావు, కల్లం రాజశేఖర రెడ్డి, ఆకుల ఉమా మహేశ్వరరావు, దామర్ల రాజు, తోట పార్థ సారధి, వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, కేసంనేని శ్రీ అనిత, జావ్వది కిరణ్ చందు, పి. మహేష్, భోగి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షునిగా దశరథరావు

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి బాపనయ్యనగర్లో ఆదివారం రెల్లి కులాల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలాపు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో మంగళగిరి పట్టణ రెల్లి కులాల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా తుపాకుల రమణమ్మ, యలమంచిలి సామ్రాజ్యం, సంఘం పట్టణ అధ్యక్షునిగా బండి దశరథరావు, ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి యర్రంశెట్టి సాయికుమార్, సహాయ కార్యదర్శి ఎం శరత్ బాబు, కోశాధికారి కొమ్మర అప్పారావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ ముత్యాల వాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వెంకటప్పయ్య దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

వెంకటప్పయ్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -మంగళగిరి

పోస్టల్ శాఖలో గత 39 ఏళ్లుగా వెంకటప్పయ్య అందించిన సేవలు అభినందనీయమని విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ సర్కిల్ హరిప్రసాద్ శర్మ కొనియాడారు. నగరంలోని హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో ఆదివారం పోస్టల్ ఉద్యోగి ఆత్మకూరి వెంకటప్పయ్య ఉద్యోగం విరమణ సందర్భంగా అభినందన సభ జరిగింది. పోస్ట్ మాస్టర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగం విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, వెంకటప్పయ్య తపాలా శాఖలో 39 సంవత్సరాల పాటు ఉద్యోగం బాధ్యతలు నిర్వర్తించి అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. మంగళగిరి బ్రాంచి పోస్టల్ యూనియన్ సభ్యునిగా, రాష్ట్ర సంఘం కోశాధికారిగా విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వెంకటప్పయ్య దంపతులకు దుశ్శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంత్ గురురవిదాస్ జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి -ఎఎన్‌యు: మాదిగ అభ్యుదయ సాధన వేదిక (ఎంఎఎస్‌వి) అధ్వర్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ దగ్గర 14వ శతాబ్దంకు చెందిన సంత్ గురు రవిదాస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్కాలర్స్, విద్యార్థులు నివాళులుఅర్పించారు. యూనివర్సిటీ స్కాలర్స్ మాట్లాడుతూ సంత్ గురు రవిదాస్ జీవితం ఆదర్శప్రాయమని, వారి బోధనలు ఆచరణాత్మకంఅని, సమాజంలో వున్న అసమానతలను రూపమాపేందుకు తన జీవిత కాలం కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆలోచనలు అత్యున్నతమైనవి అని, దేశం లో జరిగిన భక్తి ఉద్యమంలో గురు రవిధాస్ ప్రజలను చైతన్యం చేయటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. గురు రవి దాస్ ఆలోచన విధానం, బోధనలను డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్, కాన్సిరాం తదితరులు ఆచరించారని చెప్పారు. మాదిగ అభ్యుదయ సాధన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పిడతల అభిషేక్, వేల్పుల శ్రీను, పి.రోహిణి బాబు, ఎ. రాజేష్, పాల్గొన్నారు.

మక్కా మసీదు నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి అంజుమన్ ఖ్మీశాన వాటిక వద్ద నిర్మాణం జరుగుతున్న మక్కా మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం మంగళగిరి పట్టణ వైసిపి అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు నగదును మైనార్టీ నాయకులు ఎండి. ఇక్బాల్, ఎండి. ఫిరోజ్, పఠాన్ అష్రఫ్ ఖాన్, మైనార్టీ నాయకుల చేతులమీదుగా అంజుమాన సంస్థ వారికి అందజేశారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
సోమవారం 6 ఫిబ్రవరి 2023



రాఘవరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

శ్యామలానగర్ అభివృద్ధి ప్రదాత రాఘవరావు

ప్రజాశక్తి-గుంటూరు

శ్యామలానగర్ అభివృద్ధి ప్రదాత విన్నకోట వీరరాఘవరావు మరణం కాలనీ వాసులకు తీరని లోటని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం శ్యామల నగర్ పార్క్‌లోని బ్యాడ్మింటన్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరరాఘవరావు సంస్మరణ పల్లెటూరి పట్టణ సంఘం కార్యదర్శి డాక్టర్ పాలేరు పోతురాజు అధ్యక్షతన నిర్వహించారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా రాఘవరావు ఎన్జీవోలకు చేసిన కృషిని కొనియాడారు. శ్యామల నగర్ అభివృద్ధికి, పార్క్ అభ్యున్నతికి నిరంతరం కృషి చేసేవారని గుర్తు చేశారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాఘవరావు రాజకీయాలకు అతీతంగా అభివద్ధి ధ్యేయంగా కృషి చేశారన్నారు. తొలుత రాఘవరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావు, వామపక్షవాది బొప్పుడి స్టాలిన్‌బాబు, అడ్వకేట్ సురేందర్ రెడ్డి, ఇన్‌కంట్యాక్స్ అధికారి రామ్ కిషోర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధి కారులు తోటకూర శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ లలితకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్, వెంగళాయపాలెంలో హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి), కామాక్షి ఐ కేర్ (చెరుకుపల్లి) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పరిస్థితులలో చిన్న, పెద్ద వయసుతో సంబంధం లేకుండా అందర్నీ కంటి సమస్యలు బాధిస్తున్నాయన్నారు. ఇలాంటి ఉచిత నేత్రవైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్యులు వాసుదేవరావు మాట్లాడుతూ కళ్ళు పొడిబారటం, ఎరుపెక్కటం, దురదలు పుట్టటం, మండినట్లు అనిపించడం లాంటి సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్ని సంప్రదించి, మొదటి దశలోనే కంటి సమస్యలను నివారించుకోవాలని అన్నారు. కంటి చూపు మెరుగు పరుచుకోవడానికి, తీసుకోవలసిన ఆహార పదార్థాలు ఆకు కూరలు, క్యారెట్ కోడిగుడ్డు, బొప్పాయి, ఆకుపచ్చని కూరలు, దినచర్యలో భాగమైనట్లయితే కంటి సమస్యలు దరిచేరే అవకాశాలు తక్కువని చెప్పారు. 190 మందిని పరీక్షించగా, 8 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉందని వైద్యులు తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, ఫౌండేషన్ సభ్యులు శ్యాము, రవి, హాస్పిటల్స్ సిబ్బంది వనిత, సదాశివరావు, మహిళలు వద్ధులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి స్థలం కబ్జా

- విశ్రాంత ఉపాధ్యాయినికి బెదిరింపు
- రౌడీషీటర్, మరో ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విశ్రాంత ఉపాధ్యాయురాలికి చెందిన సుమారు రూ.కోటికి పైగా విలువైన స్థలాన్ని రౌడీషీటర్ కబ్జా చేయడంపై మంగళగిరి రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని ఎస్వీఎన్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు దేవరపల్లి భాగ్యలక్ష్మి తన భర్త మల్లికార్జునరెడ్డి మరణానంతరం 2005లో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం సర్వే నంబర్ 766 /2లో 525 గజాల స్థలాన్ని కొన్నారు. అయితే అందులో నిర్మాణాలేమీ చేపట్టలేదు. అదే ప్రాంతానికి చెందిన దావు కోటేశ్వరరావు తన అనుచరులు కొందరితో కలిసి ఆ స్థలాన్ని కబ్జా చేసి రేకుల షెడ్డు, చుట్టూ ఫెన్సింగ్ వేశాడు. ఇదేమీ తెలియని భాగ్యలక్ష్మి ఈ నెల 3వ తేదీన తన సోదరి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డిని తీసుకుని తన స్థలాన్ని చూసేందుకు యర్రబాలెం వెళ్లారు. అయితే ఆ స్థలం చుట్టూ ఇనుప ఫెన్సింగ్, రేకుల షెడ్డును చూసి నిర్ఘాంతపోయారు. అదే సమయంలో దావు కోటేశ్వరరావు మరో ముగ్గురితో కలసి అక్కడికి వచ్చాడు. స్థలం తనదేనని, తన జోలికి వస్తే తాను పెద్ద రౌడీషీటర్‌నని, చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు భాగ్యలక్ష్మి ఆదివారం మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. భూకబ్జాపై ఫిర్యాదు చేశారు. దావు కోటేశ్వరరావు, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



ప్రజాశక్తి-గుంటూరు

సీనియర్ సిటిజన్లు మానసికంగా దఢంగా ఉన్నా, శారీరక పటుత్వం తగ్గటం ద్వారా ఆనారోగ్య సమస్యలు తలెత్తుతాయని సకాలంలో వైద్యులను సంప్రదించడం ద్వారా మేలు కలుగుతుందని ప్రముఖ దంత, ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ తాళ్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీ లావణ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అరండల్ పేట అవగాహన సంస్థ కార్యాలయంలో 222వ ఆరోగ్య అవగాహన సదస్సులో 'దంత సమస్యలు-నూతన చికిత్సా విధానం' అంశంపై డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దంత వైద్యంలో అధునాతన శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.గతంలో షుగర్ ఉన్న వారికి దంతాల అమరికలో సమస్యలు వచ్చేవన్నారు. దంత వైద్యరంగంలో మొట్టమొదటి సారిగా 'కార్టికల్ ఇంప్లాటాలజి' అనే నూతన చికిత్సా విధానం స్విట్జర్లాండ్ యూనివర్సిటీ నుండి మాస్టర్స్ పట్టా పొందానని చెప్పారు. ఈ "కార్టికల్ ఇంప్లాంట్ టెక్నాలజీ" ద్వారా కత్రిమ దంతాల అమరికతో నూరు శాతం విజయవంతంగా పనిచేస్తాయని వివరించారు. ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ వద్ధులు ఎదుర్కొనే పక్షవాతం మెడ, వెన్ను, నడుం, కండరాల నొప్పులకు సైడ్ ఎఫెక్ట్ లేని అధునాతన పరికరాలతో పూర్తిస్థాయి యువకుల వలె ఆరోగ్యవంతులుగా మారవచ్చన్నారు. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ మెడికల్ యూనివర్సిటీ ద్వారా 'కార్టికల్ ఇంప్లాంట్ టెక్నాలజీ' ద్వారా 'మాస్టర్స్ డిగ్రీ' అందుకున్న డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డిని అవగాహన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ టివి రత్నారావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టివి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పున:ప్రతిష్ట

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో శ్రీ సీతారాముల స్వామి పున:ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని అనంతవరంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ను పోలీసులు పట్టుకున్నారు. సిఐ ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం..అనంతవరం గ్రామానికి చెందిన శంగారపాటి జోజి బాబు,అమరావతి మండలం కర్లపూడికి చెందిన కోయిలమూడి అనిల్ బాబు అనే వ్యక్తులు ఎ పి 07టి ఎం 7407 నంబర్ కలిగిన ఆటోలో 19 బస్తాల రేషన్ బియ్యంను తరలిస్తుండగా వెంకటేశ్వర స్వామి గుడి శివారులో పోలీసులు పట్టుకున్నారు .కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బోటుయార్డు స్థలాన్ని సందర్శించిన నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డు స్థలాన్ని ఆదివారం జనసేన నాయకులు పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ఈ స్థలాన్ని వైసిపి కార్యాలయ నిర్మాణం కోసం తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని నాయకులు తెలిపారు. కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని రాజకీయ పార్టీలు తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకోకూడదని సూచించారు. ప్రజల ప్రయోజనార్థం అన్ని వసతులు కలిగిన ఆస్పత్రి లేదా కాలేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆ విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి కార్యాలయం కోసం ఈ స్థలాన్ని వినియోగిస్తే పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

Name Change

I Neelam Vijayalakshmi, W/o. Neelam Ramakrishna Rao, HSNo-1-120, Uyyandana, Krosuru, Guntur, A.P. 522410, Have Change my name Neelam Vijayalakshmi to **Neelam Lakshmi** for all purposre

శతజయంతి ఉత్సవాల్లో

ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చ

ప్రజాశక్తి-తెనాలి రూరల్

మాజీ మంత్రి ఆలపాటిరాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శని, ఆదివారాల్లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, ఆయన నటించిన సినిమాలపై, రాజకీయ జీవితంపై జరిగే చర్చా కార్యక్రమం ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్ లో నిర్వహించారు. అనంతరం ప్రముఖ సాంఘిక రంగస్థల నటులు నీలా అరుణ్ కుమార్ సన్మానించి జ్ఞాపికను అందించారు. పరుచూరి సుబ్బారావు, వంగా సాంబిరెడ్డి వక్తలు గా పాల్గొని ఎన్టీఆర్ విప్లవాత్మక నిర్ణయాలు-వాటి ప్రభావం అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో వెంపటి సత్యనారాయణ, తాడిబోయిన హరిప్రసాద్, మాదల కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, పినపాటి రవీంద్ర, బడుగు మోహనరావు, కంచర్ల ఏడుకొండలు, వెనిగళ్ల శివప్రసాద్, కంచర్ల నాగభూషణం, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, గీతాంజలి మూర్తి, ఉమ్మలనేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో వర్క్‌షాపు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మేధో సంపత్తి హక్కుల యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి నూతనంగా ఆవిష్కరణలు చేపట్టే వారికి అవగాహన కల్పించేందుకు కెఎల్ విశ్వవిద్యాలయం లో ఒక రోజు వర్క్ షాపును నిర్వహించారు.ఎసిఐసి కెఎల్ స్టార్టప్‌ల ఫౌండేషన్ , కెఎల్ ఐపిఎప్ సి ల సహకారంతో ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఎసిఐసి సిఇఒ గోవిల్ అలోక్ మాట్లాడుతూ స్టార్టప్‌ల ఫౌండేషన్, డిజైన్ పేటెంట్ గురించి వివరించారు. నూతన స్టార్టప్ కోసం దరఖాస్తు చేయడం ద్వారా స్టార్టప్‌లు, పరిశోధకులు ఎలా ప్రయోజనం పొందవచ్చనే దాని గురించి తన అనుభవాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశ్రమల స్థాపన శాఖ అధికారి సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ప్రవేశ వ్యూహాలలో పోటీ ప్రయోజనాల గురించి వివరించారు. నూతన ఆవిష్కర్తలకు మేధో సంపత్తి హక్కులను పొందడం, ఆవిష్కరణలు , ప్రమాణాల భావనను వివరించారు.కెఎల్ విశ్వవిద్యాలయం పరిశోధన అభివద్ధి విభాగ అధిపతి జై కుమార్ సింగ్ మాట్లాడుతూ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పరిశోధకులు,నిపుణులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమం లో, ఎం.సాయికిరణ్, రాఘవరావు, పలుమార్లు విద్యార్థులు పాల్గొన్నారు.



మహారాజశ్రీ మోటార్ ఆక్సిడెంట్ క్లైమ్స్ ట్రిబ్యూనల్ మరియు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్ట్ విజయనగరం
యం.ఓ.పి. 198/2020

శ్రీమతి. మాతల కనక మహాలక్ష్మి మరియు తదితరులు ....పిటీషనర్లు

మరియు :

నల్లపాటి యాకూబ్ మరియు తదితరులు ....రెస్పాండెంటులు

అడ్రస్సు :

ప్రతివాది-2 : నంబుల వెంకట రామ కోటేశ్వర రావు, తండ్రి నంబుల వెంకట అప్పారావు, ఏ.పి. 07 టి.జి 1567 నెంబరు గల వేను ఓనరు, డోరు నెం. 1-4-39, రంగా కాలనీ, సంత్తెనపల్లి టౌన్, గుంటూరు జిల్లా.

నోటీసు

పైన తెలిపిన ఓ.పి. నంబరు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులో పిటీషనరు దాఖలు చేసిన పిటీషనులో 2వ రెస్పాండెంటు కోసం **తే.15-02-2023ది.** నాటికి ఈ నోటీసును ప్రచురించ చేయబడిందని గమనించండి. పై కోర్టులో పైన పేర్కొన్న తేదీలో **ఉదయం 10-30 గంటల**కు మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెను. మీరు పైన తెలిపిన తేదీలో హాజరు కాకపోయిన ఎడల, పై విషయం ఎక్స్ పార్టీగా నిర్ణయించబడునని ఈ నోటీసు మూలముగా తెలియపరచడమైనది.

పి.ఏ.ఎన్.రాజు
పిటీషనరు తరపు న్యాయవాది,
విజయనగరం

Notice
IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE: GUNTUR
M.V.O.P.No: 214 / 2020

Between:
Kotikala Samadanam & Another ... **Petitioners**
And
Ramesh Talasila & Others ..**Respondents**
To,
R-1: Ramesh Talasila,S/o.Appa Rao, (Driver Of the Tractor bearing Regn.No:AP 07 BW8840 & Trailer bearing No: AP 07 BW 8841)
R-1: Ramesh Talasila, S/o. Appa Rao, R/o.Door No:9-30,Ravikampadu (Vil),Kolluru Mandal, Guntur Dist. (Owner Of the Tractor bearing Regn.No:AP 07 BW8840 & Trailer bearing No: AP 07 BW 8841)

పై నెంబరు O.P లోని పిటీషనర్స్ యాక్టిడెంట్ లో 1వ పిటీషనరు కుమారుడు, 2వ పిటీషనరుకు సోదరుడు మరణించినందున నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P. లో 1&2 వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 22-02-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 22-02-2023

కొమటినేని శ్రీనివాస రావు,
పిటీషనర్లు తరపు అడ్వకేట్,
గుంటూరు,సెల్.9912345699

నేడు మాజీ ఎమ్మెల్యే వైవి పాదయాత్ర

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కు సంఘీభావంగా సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు 6,7 తేదీల్లో పాదయాత్ర చేయనున్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల నుండి నకరికల్లు మండలం నర్సింగపాడు వరకు సుమారు 40 కిలోమీటర్లు ఈ పాదయాత్ర కొనసాగనుంది. సోమవారం ఉదయం 8గంటలకు ధూళిపాళ్ల నుండి పాదయాత్ర ప్రారంభమై ముప్పాళ్ళ మండలం తొండపి నకరికల్లు మండలం చాగల్లు కండ్లకుంట వరకు, మంగళవారం కండ్లగుంట నుండి చీమలు మర్రి చల్లగుండ్ల నకరికల్లు అడ్డరోడ్డు నర్సింగపాడు శివాలయం వద్ద పాదయాత్ర ముగియనుంది. అనంతరం లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. .సత్తెనపల్లి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్ర ను జయప్రదం చేయాలని టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు.



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో అకాడమీ డైరెక్టర్ బి.కిషోర్

పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో మాస్టర్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎపి పోలీస్ నియామక మండలి ఆదివారంవిడుదల చేసిన ఎపి కానిస్టేబుల్ ఫలితాలలో తమ అకాడమీ విద్యార్థులు 20 మంది ఉత్తీర్ణత సాధించారని నరసరావు పేట మాస్టర్స్ అకాడమీ డైరెక్టర్ బి.కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అకాడమీలో అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు. అధ్యాపకులు బి.కాజా, పి.శ్రీనివాసులు, యు.సైదారావు పాల్గొన్నారు.



దస్తూరి పై లక్ష మందికి శిక్షణే లక్ష్యం

చేతిరాత నిపుణులు రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి - వినుకొండ

దస్తూరిపై లక్ష మందికి శిక్షణ ఇవ్వాలన్నదే తన లక్ష్యమని ప్రముఖ చేతిరాత నిపుణులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి. రామ్మోహనరావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అందమైన చేతిరాత ఒక్కరోజులో' అను ప్రత్యేక కార్యక్రమం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావును ట్రస్ట్ అధ్యక్షులు బివి. నాగేశ్వరరావు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం రామ్మోహన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలో పలు పాఠశాలల్లో 825 మంది ఉపా ధ్యాయులకు, 20 వేల 400 మంది విద్యా ర్థులకు కాలిగ్రఫిలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 'చిట్టి చేతులు చక్కని రాతలు' అనే కార్యక్రమానికి రూపకల్పన చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఎం.ఎస్.కె బాషా, ప్రత్యేక ఆహ్వానితులు గంగవరపు వెంకాయమ్మ పాల్గొన్నారు.

పట్టణాల్లోనూ ఉపాధి పనులు కల్పించండి

- **పంటలకు మద్దతు ధర చట్టం చేయండి**
- **రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గోపాలరావు**
- **ఏప్రిల్ 5న చలోఢిల్లీ విజయవంతానికి పిలుపు**

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధి హామీ చట్టంను పట్టణాల్లో కూడా అమలు చేసి కూలీలకు పనులు కల్పించాలని పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వినుకొండ మండల రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీ సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎ. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతులను, రైతు కూలీలను, కార్మికులకు తీరని అన్యా యం చేస్తోందని విమర్శించారు. అందరూ ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవడంతో పాటు మోడీని గద్దె దించాలని అన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 4 కోడ్ లుగా చేసి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, సంఘటితంగా హక్కులు కాపాడుకోవాలని చెప్పారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొస్తానని హామీ ఇచ్చిన మోడీ, ఎనిమిదేళ్లు గడిచినా నేటికీ అమలు చేయకుండా రైతులను మోసం చేశారని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటులో లేక రైతు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో 3958 మంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది రైతుల ఆత్మహత్యలతో వారి కుటుంబాలు వీధిన పడ్డా మోడీ ప్రభుత్వానికి కనికరం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతు, వ్యవసాయ కూలీ, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించేందుకు అన్ని రంగాలు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్ రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.శివరామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు, ఆర్. వెంకటేశ్వర్లు, రాజా, తిరుమల లక్ష్మీ, నాసర్ బి, రంజాన్ బి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు



ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న వ్య.కా.స. నాయకులు

యండ్రాయిలో ప్రచారం

ప్రజాశక్తి-అమరావతి

మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీ ఢిల్లీలో చేపట్టనున్న కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అను ముల లక్ష్మీశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని యండ్రాయి లో ఆదివారం ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీకి మద్దతు ఇవ్వాలని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ విధానాల వల్ల వ్యవసాయం తీవ్రం సంక్షోభంలో కూరుకుపోతోందని అన్నారు. గిట్టుబాటు కాక ఈ ఏడాది పల్నాడు జిల్లాలో లక్షలాది ఎకరాల భూమిలో ఏ పంటా వేయకుండా నిరుపయోగంగా మిగిలిపోయిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సం ఘం మండల నాయకులు ఎన్. వెంక టేశ్వరరాజు, సిఐటియు మండల కార్యదర్శి బి.సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఎన్' విద్యార్థికి రజత పతకం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల ఫెన్సింగ్ పోటీలలో ఎస్.ఎస్.ఎన్ కళాశాల లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి డి.నిఖిలేశ్వర్ అండర్ - 17 పురుషుల విభాగంలో పల్నాడు జిల్లా తరపున ఆడి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సోము మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.గత నెల 27 నుండి 29 వ తేదీ వరకు కర్నూలు పట్టణంలోని మాంటి స్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈ పోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, కళాశాల పాలకవర్గ సెక్రెటరీ,కరస్పాండెంట్ మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు పాలకవర్గ సభ్యులు కూనిశెట్టి లక్ష్మయ్య, ఇంటెన్సివ్ క్యాంపస్ ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వ్యాయామ అధ్యాపకులు యక్కల మధుసూదన్ రావు, అధ్యాపకులు అధ్యాపకేతన సిబ్బంది విద్యార్థిని అభినందించారు.



నిఖిలేశ్వర్ ని అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు

కార్మికుని స్థలంపై పెత్తందారుల కన్ను

- **వెల్డింగ్ షాప్ తీసివేయాలంటూ అధికారుల ఒత్తిడి**
- **కోర్టు స్టే ఉన్న దౌర్జన్యం - న్యాయం కోసం అభ్యర్థన**

ప్రజాశక్తి - వినుకొండ

వెల్డింగ్ కార్మికుని స్థలంపై పెత్తందారుల కన్ను పడింది. కొనుగోలు చేసిన భూమి అని చెబుతున్నా ఎన్ఎస్‌పి, మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేస్తూ ఆయనను ఇబ్బంది పెడుతున్న విసుకొండలో జరిగింది. సెంటు భూమి కొనుగోలు చేసుకుని 35 ఏళ్లుగా వెల్డింగ్ పనిచేసు కుంటూ మరోవైపు కార్మి కుల సమస్యలపై పోరాడుతూ, సిపిఎంలో క్రియాశీలకంగా పని చేసిన సీనియర్ నాయ కులు మదార్ వలిని అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. నాడు రోడ్డు పక్కన రాడ్ వెల్డింగ్ షాపు పెట్టి పని చేసుకుంటూ కుటుంబ జీవనం సాగించే మదార్ వలి షాపును 1989లో రోడ్డు విస్తరణలో తొలగించారు. ఆ సమయంలో నరసరావుపేట రోడ్డులోని పెనుమల్లపల్లి మేజర్ కాలువ పక్కన అర సెంటు స్థలాన్ని గంగినేని రామయ్య వద్ద వెయ్యి రూపాయలకు కొనుగోలు చేసి, అక్కడ వెల్డింగ్ షాపు ఏర్పాటు జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన అనారోగ్యం బారిన పడటంతో, తోటి కార్మికులతో పనులు చేయిస్తూ షాపును సాగిస్తున్నాడు. అయితే, ఈ షాపును తొలగించాలంటూ ఇటీవల మునిసిపల్ అధికారులు మదార్‌వలికి నోటీసులు ఇవ్వడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. షాపును తొలగించేందుకు వీలు లేదంటూ కోర్టు స్టే కూడా ఇచ్చింది. కానీ, ఎన్ఎస్‌పి అధికారులు మాత్రం వెల్డింగ్ షాపు ఎన్ఎస్‌పి స్థలంలో ఉందంటూ ఖాళీ చేయాలని ఆయనపై ఒత్తిడి చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. వెల్డింగ్ షాపు ఉన్న భూమికి ఎన్ఎస్‌పికి సంబంధం లేదని, తాను ఆరసెంట్ భూమిని కొనుగోలు చేయడం జరిగిందని చెప్పి కోర్టు స్టే ఇచ్చిన ఒత్తిడి చేస్తున్నట్లు బాధితుడు చెబుతున్నారు.

సర్వేనెంబర్ 361 ఆర్ఎస్ ఆర్ దాఖల పట్టా భూమిలోని 2.48 ఎకరాల్లో నాడు వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చి పంచాయతి పరిధిలో లేఅవుట్ వేసి విక్రయిం చారని వివ రించారు. ఆ పొలంలో నుంచి పెరుమళ్ళ పల్లి మేజర్ కాలువకు 12 సెంట్లు భూమి కూడా నాటి రైతులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చి ఇళ్ల స్థలాలుగా విక్రయించగా, క్రాస్‌లో మిగిలిన నాలుగు సెంట్ల భూమిలో అర సెంటు స్థలాన్ని గంగినేని రామయ్య, వెయ్యి రూపా యలకు మదార్ వలికి విక్రయించి స్వాధీనపు అగ్రిమెంటు ఇచ్చారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భూమికి విలువ పెరగడం, నరసరావుపేట రోడ్డు ఎన్ఎస్‌పి స్థలాన్ని ఆనుకొని జాతీయ రహదారికి పక్కగా ఉండటంతో దీనిపై కన్నుపడ్డ పెత్తందారులు దీనిని అప్పనంగా కాజేయాలనే దురాశతో ఎన్ఎస్‌పి మునిసిపల్ అధికారు లను ఒత్తిడి చేసి వలిని ఇబ్బం దులపాలు చేస్తున్నారు.

ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు లోకల్ టివి ఛానల్‌లో మాట్లాడుతూ ఎన్ఎస్‌పి స్థలం ఆక్రమణలో ఉందని, గంగినేని రామయ్య, మరో వ్యక్తికి అమ్మారని, అతని చేత కోర్టులో కేసు వేయించారని త్వర లోనే ఆ స్థలం ఖాళీ చేయిస్తానని అనడం బాధితుడిని మరింత ఆందోళనకు గురిచేసింది. 361 సర్వేనెంబర్ లో విస్తీర్ణం సర్వే చేసి నిర్ధారించకుండా అధికారులు ఇలా ఒత్తిళ్లు చేయడం సరికాదని, గతంలో వేసిన లే అవుట్ వెంచర్‌ను పరిశీలించి సమగ్ర సర్వే చేసి న్యాయం చేయాలని బాధితుడు మదర్ వలి కోరుతున్నాడు.



సోషలిస్టు భావజాలం వ్యాప్తికి నిరంతర కృషి

సరస్వతి సంస్మరణ సభలో వి.కృష్ణయ్య



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు వి. కృష్ణయ్య

ప్రజాశక్తి-తాడేపల్లి: సోషలిస్టు భావజాలం కోసం నిరంతరం బూరుగ సరస్వతి కృషి చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య శ్లాఘించారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు, ఐద్వా తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షురాలు బూరుగ సరస్వతి సంస్మరణ సభ ఆదివారం సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అధ్యక్షతన ప్రకాష్‌నగర్ సెంటర్‌లో జరిగింది. ముందుగా వక్తలను సిపిఎం పట్టణ కమిటీ నాయకులు వేముల దుర్గారావు వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సమాజ మార్పు కోసం ప్రజలందరికీ సమాన అవకాశాల కోసం సరస్వతి తుదిశ్వాస వరకు పని చేశారని చెప్పారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిన బూనారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.130 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని విమర్శించారు. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ అమలు చేయడానికి మళ్లీ అప్పు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తుందని తెలిపారు. ఇసుక, మద్యంపై రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు దండుకుంటుందని విమర్శించారు. ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపరచకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కే కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగిన రైతు పోరాటాలతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు పరచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోగానీ, బడ్జెట్లోగానీ అందుకు సంబంధించిన ఎటువంటి డిమాండ్ పెట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శించారు. నకిలీ విత్తనాలు రాజ్యమేలి రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రూ. 90 వేల కోట్ల రూపాయల ఆహార సబ్సిడీని కేంద్రం తగ్గించిందని చెప్పారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల దగ్గర ఉండగా ఇప్పటికీ 35 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యమాల్లో సర్వస్వతి పాత్ర కీలకం



సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో జరిగిన ప్రజాతంత్ర ఉద్యమాల్లో బూరుగ సరస్వతి కీలకంగా పని చేశారని చెప్పారు. ఉద్యమంలో పని చేయడంతో పాటు పార్టీ ద్వారా వచ్చిన ప్రజాప్రతినిధి పదవులను పార్టీ అభివృద్ధి కోసం వినియోగించారని చెప్పారు. తాడేపల్లిలో ఆరు వేల మందికి పట్టాల పేరుతో తెల్ల కాగితాలు పంపిణీ చేసిన వైసిపి ప్రభుత్వం ఇప్పటికైనా వారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో అనేక వేల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చి పట్టాలు ఇప్పించిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండారెడ్డి అమరవీరుల కృషి దీనిలో దాగి ఉందన్నారు. నేటి పరిస్థితుల్లో సరస్వతి లాంటి కార్యకర్తల ఉద్యమస్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు



బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ సరస్వతి మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుదామని తెలిపారు. రాబోయే పది సంవత్సరాల కాలంలో అనేక మార్పులు చోటు చేసుకోబోతున్నాయని చెప్పారు.



రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివ శంకరరావు మాట్లాడుతూ బిజెపి మతతత్వ ప్రమాదం ముంచుకొస్తున్న నేటి తరుణంలో సరస్వతి లాంటి కార్యకర్తలు లేని లోటు ఉద్యమానికి నష్టమన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సిపిఐ ఎంఎల్ నాయకులు కుర్రపాటి ఆదినారాయణ మాట్లాడుతూ సరస్వతి కుటుంబంతో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో ఆమె స్పందించిన ఒరవడిని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ సంతాప సభలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య, సిపిఎం జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యులు ఎం.రవి, సిపిఎం నాయకులు హరికిషోర్, బైరగాని శ్రీనివాసరావు, జెవి రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, ఎం.పకీరయ్య, ప్రొఫెసర్ బూరుగ శ్రీనివాసరావు, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కె.కరుణాకరరావు పాల్గొన్నారు. ముందుగా సరస్వతి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.



సభలో బూరుగు సరస్వతికి నివాళులర్పించి మాట్లాడుతున్న నాయకులు



సరస్వతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వి. శ్రీనివాసరావు

కేంద్రం చేసిన అన్యాయంపై ఎందుకు నోరు మెదపడంలేదు

వైసిపి, టిడిపిలకు సిపిఎం సూటి ప్రశ్న

బూరుగ సరస్వతికి నివాళులర్పించిన వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తాడేపల్లి: రాష్ట్రానికి అడుగుడుగునా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నోరు మెదపడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూటిగా ప్రశ్నించారు. ఆదివారం తాడేపల్లి పట్టణ ఐద్వా నాయకులు బూరుగ సరస్వతి సంస్మరణ సందర్భంగా ప్రకాష్‌నగర్‌లోని ఆమె ఇంటి వద్ద సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పని చేసిన బూరుగ సరస్వతి ధన్యజీవి అని కొనియాడారు. ప్రజాతంత్ర ఉద్యమంలో ఆమె పని చేయడమే కాకుండా కుటుంబ సభ్యులందరికీ తోడ్పాటు అందించి ఉద్యమంలో పని చేసే విధంగా చూశారని చెప్పారు. సరస్వతి భర్త బూరుగ వెంకటేశ్వర్లు సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శిగా పని చేయడం వెనుక ఆమె కృషి దాగి ఉందన్నారు. సరస్వతి మృతి పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయడంలో బిజెపి విఫలమైందని విమర్శించారు. కేంద్రం మెడలు వంచి హక్కుల సాధిస్తానని చెప్పిన జగన్ ప్రభుత్వం కేంద్రం ముందు సాకిలపడిందని ఎద్దేవా చేశారు. మతోన్మాదం, కార్పొరేటీకరణ జమిలీగా సాగుతున్న ఈ తరుణంలో సరస్వతి లాంటి కార్యకర్తలు మృతిచెందడం బాధాకరమన్నారు. ఏ ఆశయం కోసం ఆమె పని చేశారో దాన్ని ముందుకు తీసుకెళ్లడమే సరస్వతికి అర్పించే నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి, సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, సర్వసతి భర్త వెంకటేశ్వర్లు, బూరుగ రామయ్య నివాళులర్పించారు.


గ్రామాల్లో అభివృద్ధి పనులు లేవు

- మూడేళ్లయినా ప్రారంభవని పనులు
- మార్చి 1నాటికి ప్రారంభించకుంటే రాజీనామా
- సర్వసభ్య సమావేశంలో ముందుగానే లేఖను సమర్పించిన వైసిపి ఎంపిటిసి



సమావేశంలో మాట్లాడుతున్న ఫణి కుమార్

ప్రజాశక్తి తెనాలి/తెనాలి రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగటంలేదని కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యాయని కొలకలూరి ఎంపీటీసీ కాలిశెట్టి ఫణి కుమార్ ధ్వజమెత్తారు. ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభమైన వెంటనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వ సహకారం కొరవడిందంటూ పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. కొలకలూరు ఎంపీటీసీ-2 కాలిశెట్టి ఫణికుమార్ మాట్లాడుతూ కొలకలూరులో ప్రధాన కూడలి నుంచి అనుమర్లపూడి డొంక రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లు గడిచిందని, ఇప్పటికీ ఆ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇంకా గ్రామంలో పలు అబివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనకే పరిమితమయ్యాయన్నారు. సమావేశాలలో చేసిన తీర్మానాలు అమలు కావడం లేదన్నారు. స్వతహాగా ఖర్చు చేసి ఏవైనా పనులు చేపడితే తిరిగి ఆ నిధులు చెల్లించే పరిస్థితి కూడా లేదన్నారు. ఈ నేపథ్యంలో మార్చి ఒకటి నాటికి పెండింగ్ పనులు ప్రారంభం కావాలన్నారు. లేకుంటే అభివృద్ధి చేయకుండా తాను ఎంపీటీసీగా కొనసాగలేనని, పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఏకంగా జిల్లా పరిషత్ సీఈఓకు రాజీనామా లేఖను ముందుగానే రాసి సమావేశంలో ఎంపీపీకి సమర్పించారు. ఇదే పరిస్థితి కొనసాగితే మార్చి 1న అధికారిక ప్రొఫార్మాలో రాజీనామా సమర్పిస్తానని లేఖలో స్పష్టం చేశారు. గత రెండు మూడు సమావేశాలలోనూ అభివృద్ధి కార్యక్రమాలపై ఫణికుమార్ నిలదీశారు. అయినా ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా లేఖతో అల్టిమేటం ప్రకటించారు. ఇటీవల గ్రామంలో డయేరియా ప్రబలిన సందర్భంగా శానిటరీ, మెడికల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటనలు, మకాం వేసిన సందర్భంగా వారికి భోజనాలు వగైరా వంటి సదుపాయాలకు పంచాయతీ నుంచి నిధులు వెచ్చించారని, వాటిలో అధిక మొత్తంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. ఆ లెక్కలు అధికారికంగా ప్రకటించాలని పంచాయతీరాజ్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, ఎంపీటీసీ ఫణికుమార్ మధ్య వాదోపవాదాలు జరిగాయి. అలాగే మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కోడూరి స్వప్న మాట్లాడుతూ జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలకు అనుకూలమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి మాట్లాడుతూ గ్రామంలో వ్యర్థాలను తరలించేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ లేదని, దానికోసం నిధులు కేటాయించాలని కోరారు. కోపల్లె ఎంపిటిసి కే.కిషోర్ బాబు గ్రామంలో రోడ్ల నిర్మాణాలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంపీటీసీ ఫణికుమార్ రాజీనామా అస్త్రం అధికార పార్టీలో చర్చనీయాంశమైంది. గతంలోనే అసంతృప్తి వ్యక్తం చేసిన ఫణికుమార్ రాజీనామా చేస్తాడన్న పుకార్లు రావటంతో ఎమ్మెల్యే సర్దిచెప్పినట్లు సమాచారం. అయినప్పటికీ ప్రస్తుత సమావేశంలో ఒక్కసారిగా రాజీనామా చేస్తానంటూ ఫణి కుమార్ చెప్పడం ఆ పార్టీలో సంచలనం రేకెత్తించింది. ఇదిలా ఉంటే సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా ఎక్కువమంది గైర్హాజరయ్యారు. దీనిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకానివారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎల్ విజయ లక్ష్మణ్ ను ఆదేశించారు. జడ్పిటిసి పిల్లి ఉమా ప్రణతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



ఫణి కుమార్ సమర్పించిన రాజీనామా లేఖ



ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కె. ఎస్ లక్ష్మణరావు

జై కిసాన్ కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు ఈద్గా ఎదురు జై కిసాన్ నూతన కోల్డ్ స్టోరేజ్ ని ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జై కిసాన్ కోల్డ్ స్టోరేజ్ యజమానులు పాలు పడ్డ సాంబశివరావు పాములపాటి రామకష్ణ పావులపాటి జయలక్ష్మి సిపిఎం పార్టీ నాయకులు నేతాజీ, బి శ్రీనివాసరావు, మేడికొండూరు మండల సిపిఎం పార్టీ కార్యదర్శి బొట్ల రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు



కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - రొంపిచర్ల

ఉచిత మెగా వైద్యశిబిరములను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేటఎమ్మెల్యే డాక్టరు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నరసరావుపేటకు చెందిన డా.రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరము నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా నరసరావుపేట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మంచి పేరు సంపాదించుకున్నారని ప్రశంసించారు. డాక్టర్ రామలింగారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. వైద్యశిబిరములో ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ రామలింగారెడ్డి పాల్గొని వైద్యసేవలు అందించారు. 256 మందికి కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. వారిలో 85 మందిని ఆపరేషనుల అవసరమని,తమ హాస్పిటల్ లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు చపారపు గోపాలరెడ్డి, పిజెబిఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పడాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేజ్ క్లినిక్‌లలో ఆర్ఎంపి, పిఎంపిలను నియమించాలి

ప్రజాశక్తి - రొంపిచర్ల

స్థానిక రొంపిచర్లలోని భగత్ సింగ్ భవన్ లో ది ఆర్ ఎంపి, పిఎంపి కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టరు చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. అసోసియేషన్ కోశాధికారి సంగీతరావు ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించారు. అరవిందబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఆర్ ఎంపి, పిఎంపిల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్‌లలో తగిన అర్హతగలిగిన ఆర్ ఎం పి,పిఎంపిలను ఉద్యోగులుగా ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టరు గోదా రమేష్ కుమార్ మాట్లాడుతూ రొంపిచర్లలో ఆర్ఎంపి,పిఎంపి అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని నిర్మిం చేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని అరవింద్‌బాబును కోరారు. తప్పకుండా సాయమందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపి,పిఎంపిల సమస్యలను టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం అరవిందబాబును, కేరళ ఆయుర్వేద హాస్పటల్ వైద్యులు లక్కిరెడ్డి వెంకటేశ్వరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వాలు దిగొచ్చేది ఉద్యమాలతోనే

- 'చలో ఢిల్లీ'లో ఎక్కువ మంది యువకులు పాల్గొనాలి
- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్షులు వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరీపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన మందిర్‌లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్షులు వై.రాధాకృష్ణ, విఆర్ఎల పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యమాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగి వస్తున్నాయన్నారు. ఢిల్లీలో రైతుల, విశాఖ పట్నంలో విశాఖ ఉక్కు పోంటాల గురించి ప్రస్తావించారు. ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ కార్యక్రమానికి చిలకలూరి పేట మండలం నుండి ఐదుగురుకన్నా ఎక్కువ యువకులు పాల్గొనేలా ప్రణాళికను రూపొందించుకోవాలని, ఇంకా ఎక్కువ మంది వస్తే మంచిదని అన్నారు.

బందగి సాహెబ్ మాట్లాడుతూ విఆంఎలు స్థానికంగా పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మొన్న వినుకొండలో జరిగిన మహాసభలో ముఖ్య మంత్రి జగన్‌కు తమ సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రం ఇచ్చే అవకాశం కూడా లేని విధంగా ప్రభుత్వం కట్టడి చేస్తోందని విమర్శించారు. ఫేస్ యాప్ సమస్య పరిష్కరించాని కోరారు. జిఒ నెంబర్ 1ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్ఎల భవిష్యత్తు కార్యా చరణ పై ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. విఆర్ఎల డిఎకు సంబంధించిన కోర్టు లో పిటిషన్ , ఇంకా పలు సమస్యల పరిష్కారం పై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనందకుమార్ సిఐ టియు మండల అధ్యక్షులు పేరు బోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని వై.రాధాకృష్ణ పిలుపు నిచ్చారు. సిఐటియు రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక పండరీపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన మందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక ,ఉద్యోగ, రైతు వ్యతిరే క విధానాల గురించి గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి చెప్పాలన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రైతులు, కార్మికుల తమ పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అను కూలంగా ఉందని, ఆహార, వ్యవసాయ సబ్సిడీలకు కోతలు విధించడం అన్యాయమని అన్నారు. ఈ బడ్జెట్‌తో కార్మికులు, రైతులు, మహిళలకు ఎలాంటి ఉపయోగమూ లేదన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గతంలో కేటాయించిన నిధుల కంటే రూ.30 వేల కోట్లు తగ్గించారని విమర్శించారు పట్టణ ప్రాంతాలకూ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని, రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు రైతుల నిధులను పెంచకపోగా ధరల స్థిరీకరణ బీమా ప్రీమియంలో నిధులను తగ్గించారని, ఆత్మహత్య లకు గురవుతున్న కౌలు రైతుల గురించి ఎక్కడ మాట్లాడలేదని, కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చడంపె మండిపడ్డారు.

పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేసే నిమిత్తం ఈ నెలాఖరు లోపు అన్ని సంఘాలతో సమావేశాలు , పట్టణాల్లో గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాతలూరి బాబు, బి.కోటా నాయక్,కారుచొల రోశయ్య, సాంబిరెడ్డి, వీఆర్ఏ, రిక్షా కార్మికులు, అంగన్వాడి, ఆశ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

పాదయాత్రతో వైసిపికి ఓటమి భయం

చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-నరసరావుపేట

యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక 24 వ వార్డులోని ప్రశాంతినగర్‌లో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ చదలవాడ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రశ్నావళి పత్రంలో నమోదు చేసుకున్నారు. అరవిందబాబు మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్రను అడ్డుకోవడం చూస్తే జగన్ ఎంత భయపడుతున్నాడో అర్థమవుతోందన్నారు. టిడిపి నాయకులు రావిళ్ళ పెద్ద నాగేశ్వరరావు, దొడ్ల పరమేశ్వరరావు, ఇన్నమురి శీను, సాదినేని శీను, తుర్లపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



'అర్థంపర్థం లేని విమర్శలు'

ప్రజాశక్తి - బెల్లంకొండ

వైసిపి నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేసి వారి పరువుని వారే తీసుకుంటున్న పరిస్థితి దాపురించిందని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు గడ్డిపర్తి నాగేశ్వరరావు (సముద్రం) విమర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుపై అభిమానంతో పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన మీరా వలి ఆయనతో సెల్ఫీ దిగి, తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా చెప్పడంపై పెదకూరపాడు వైసిపి నాయకులు విమర్శలు సబబు కాదని హితవు పలికారు.

చిరుధా(దై)న్యం...

- కొనేవారున్నా సాగు ఏదీ?
- గిట్టుబాట్టవ్వక రైతు వెనుకంజ
- భరోసా ఇస్తే పండిస్తామన్న సాగుదార్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిరుధాన్యాలు కొర్రలు, సాములు, అరిగలు, ఊదలు, జొన్నలు, రాగులు, సజ్జలను కొనుగోలు చేసేవారున్నా.. ఆ పంటలు వేసే రైతులేరి? ఒకప్పుడు వీటిని కొనుగోలు చేసే వారి సంఖ్య తక్కువ. ఇప్పుడు.. కొందామంటే చిరుధాన్యాలు ఎక్కువగా లేకపోగా, వాటి ధరలూ బాగానే ఉన్నాయి. దీనికి కారణం, మద్దతు ధర, అమ్మకాలకు అవకాశం లేకపోవడంతో వీటిని పండిం చేందుకు రైతులు ఉత్సాహం చూపడం లేదు. ముందుకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అయితే పొలంగట్ల వెంబడి వీటిని పండించేందుకే పరిమిత మయ్యారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా చిరుధాన్యా లను పండించకపోతుండటం, ఒకవేళ పండించినా గిట్టుబాటు కాకపోతుండటంతో అధిక శాతం రైతులు వాణిజ్య పంటల వైపు దృష్టి సారించిన పరిస్థితి. చిలకలూరిపేట మండలంలోని మురికిపూడి, కోమటినేని వారి పాలెం, గోవిందపురం, మానుకొండు వారి పాలెం, వేలూరు మొదలైన 29 గ్రామాల్లో చిరుధాన్యాలను ఎంతో కొంత మేరకు ప్రతి ఏటా పండించే వారు. అయి తే, వీటిని నిల్వ చేసే సామర్థ్యం, అవగాహన లేకపోవడంతో అన్ని గ్రామా ల్లోనూ ఈ పంటలు సాగుకు రైతులు స్వస్తి చెప్పారు. కావూరులో ఒకప్పుడు అనగా 2020-2022 సంవత్సరా లలో వరిగలు 20 ఎకరాలు సాగుచేశారని స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీలత చెబు తున్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి తక్కువగా ఉండటంతో వాటి ధరలు బియ్యం ధరలను మించి పోయాయని పేదలు, వీటిని ఆహారం తీసుకునే కొంత మంది వ్యాధిగ్రస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం చిరుధాన్యాల ధరలు కిలో జొన్నలు (పచ్చవి) రూ.70, తెల్ల జొన్నలు రూ.40, రాగులు రూ.38, సజ్జలు రూ.60, కొర్రలు రూ.60, సాములు రూ.110, అరిగలు రూ.85, ఊదలు రూ.86, కొర్రలు రూ. 130 వరకు పలుకుతున్నాయి. రాగులు, జొన్నలు, సజ్జలు మొదలైన చిరు ధాన్యాలను రేషన్ దుకాణాల ద్వారా రాయితిపై కావాలని కార్డుదారులు కోరడం గతంలో నిర్వహించిన వలంటీర్ల సర్వే ద్వారా తేలింది. చిరుధాన్యాలకు ఎంతటి డిమాండ్ ఉందో ఈ సర్వే ద్వారా అర్థం చేసుకోవచ్చు. మారుతున్న ఆహారపు అల వాట్లలో భాగంగా ఉన్నత, మధ్య తరగతి, కుటుంబాలే కాదు పేదలు వాటి విని యోగంపై ఆసక్తి చూపుతుండటం వాలం టీర్ల నివేదిక అద్దంపడుతోంది. చిరుధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు 'మిల్లెట్ మిషన్' అంటూ గొప్పగా ప్రవేశ పెట్టిన పథకం కాగితాలకే పరిమిత మైపోయిందని రైతులు, రైతు నాయకులు విమర్శిస్తున్నారు.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మళ్ళీ రేషన్ దుకాణాల ద్వారా రాగులు, జొన్నలు సజ్జలు పంపిణీ చేస్తామంటోంది. అధిక విస్తీర్ణంలో సాగు చేయాలంటే లక్ష్యాలు నిర్ణయించుకుని మద్దతు ధర ముందుగానే ప్రకటించాలని, వాటిని ప్రభుత్వ మే కొనుగోలు చేయాలని, నిల్వ చేసేందుకు తగిన సౌకర్యాలు



కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కాస్త ఒకట్రెండు క్వింటాళ్ల మాత్రమే వస్తోందని, కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే నూతన వంగడాలను సాగులోకి తేవాలని కోరుతున్నారు. ఆయా విషయాలపై దృష్టి సారించడం ద్వారా అధిక విస్తీర్ణం లో సాగు చేసి, దిగుబడి పొందగలమనే అభిప్రాయం రైతులు వ్యక్తం చేస్తున్నారు.



కార్పొరేట్, పెట్టుబడిదారుల కోసమే చట్టాల్లో మార్పులు

ప్రజాశక్తి - పెదకాకాని

కేంద్రంలో బిజిపి కార్పొరేట్, పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం వ్యవసాయ, కార్మిక చట్టాల్లో మార్పులు తెచ్చి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కార్యాలయంలో ఉన్న సిఐటియు కార్యాలయంలో ప్రజాసంఘాల మండల సదస్సు ఆదివారం నిర్వహించారు. సదస్సుకు నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన జొన్న శివశంకర్ మాట్లాడారు. ఎరువుల్లో సబ్సిడీలు కోతల పెడుతూ రైతుల బోర్లకు మీటర్లు బిగించాలని ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలిపించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి కార్మికులకి నష్టం కలిగించే లాగా కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూరేలాగా కార్మిక చట్టాల్లో మార్పు చేశారని అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని దినాలు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లాంటి చట్టాలు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు ఇవ్వాలని అన్నారు. గత 15 ఏళ్లుగా వేతన సవరణ జరగలేదని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులను పర్మిట్ చేస్తానని చెప్పినటువంటి జగన్మోహన్ రెడ్డి ఏ ఒక్కరినిపర్మెంటు చేయకపోగా సిపిఎస్ రద్దు చేయాలని, ఉద్యోగ సంఘాల ఆందోళన చేస్తుంటే వారి సమస్యలుపరిష్కరించకుండా ప్రజా ఉద్యమాలను అణచివేయాలని జీవో నెంబర్ ఒకటి తీసుకువచ్చారని అన్నారు. జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గ్రామాలలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే ధర్నాలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దీవి నరసింహారావు దానియేలు అమతరావ్ కే సత్యనారాయణ వి. శివయ్య, బి. సాంబయ్య, బి. బాబురావు, ఆర్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్నసిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి కళ్ళం సాంబశివరెడ్డి అన్నారు. ఆదివారం ఇండియన్ లేబర్ లైన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతృత్వంలో మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామ పరిధిలోని వివిధ రకాల క్వారీలలో పనిచేస్తున్న వలస కూలీలతో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి కళ్ళం సాంబశివరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత మూడు నెలలుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వలస కార్మికులను గుర్తించడంలో డిబిఆర్సి జిల్లా ప్రతినిధులు విశేష కృషి చేశారని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఆయన దృష్టికి వారి సమస్యలను తీసుకురావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిబిఆర్సి ప్రోగ్రాం మేనేజర్ సామ్యూల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి శ్రమకు తగిన కూలి అందేలా చూడడమే ముఖ్య ఆశయంగా డిబిఆర్సి పనిచేస్తుందని, వారి కోసం లేబర్ కార్డులు,ఈ- శ్రమ్ కార్డులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా 40 మంది కార్మికులకు జీరో అకౌంట్స్, లేబర్ కార్డులు కొరకు నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ హెల్ప్ లైన్ ఫీల్డ్ మోబాలైజర్ మిక్కిలి సురేష్ బాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనం నిరుపయోగంగా ఉన్న కారణంగా ప్రభుత్వం చొరవ తీసుకొని భవన నిర్మాణ పనులు ప్రారంభం కోసం నిధులు విడుదల చేసే విధంగా కృషి చేయాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్, వివిధ సంఘాల నాయకులు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను కోరారు. ఈమేరకు ఆదివారం సుచరితకు వివిధ సంఘాల నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. గత కొంత కాలంగా అంబేద్కర్ భవనం నిరుపయోగంగా ఉండటం వల్ల దళిత బహుజన ప్రజా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకోవటానికి వేదిక లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సుచరిత మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పనులు ప్రారంభించే విధంగా చూస్తామన్నారు.



ఎఎన్‌యు లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యాంపస్ లా కాలేజ్ లో న్యాయశాస్త్రం అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం డైక్ మెన్ ఆడిటోరియంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకకు ఆత్మీయ అతిథులుగా గురుదేవులు ఎఎన్ యూ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య వై.హరగోపాల్ రెడ్డి, ఆచార్య ఎన్.రంగయ్య, ఆచార్య ఎ.సుబ్రహ్మణ్యం, ఆచార్య కె.ఎం. హెచ్ రాయప్ప, ఆచార్య ఎల్.జయశ్రీ, ఆచార్య భాస్కరరావు, పూర్వ విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.రామకష్ణప్రసాద్, జస్టిస్ వి.ఆర్.కె.కపాసాగర్ లు విచ్చేశారు. వేదికపైన తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులనే ఆశీనులను చేసి హైకోర్టు న్యాయమూర్తులిద్దరు కూడా తోటి పూర్వవిద్యార్థులతో కలిసి కూర్చుని కార్యక్రమాన్ని తిలకించడం విశేషం. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆచార్య హరగోపాల్ రెడ్డి కీలక ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ముఖ్యులైన పూర్వ విద్యార్థి, ఏపీ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబరు డాక్టర్ శ్రీనివాసరావు గోచిపాతలను పూర్వ విద్యార్థుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ కలయికకు యూనివర్సిటీలో లా ప్రారంభించిన 1979 నుంచి చివరి బ్యాచ్ 1998 వరకు చదివిన పూర్వవిద్యార్థుల్లో చాలామంది విచ్చేయడం విశేషం. తెలుగురాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల్లోనూ స్థిరపడిన పలువురు ప్రముఖులు విచ్చేసి లా పూర్వ విద్యార్థులతో కలసి సందడి చేశారు.

మహిళలపై దాడుల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - తుళ్లూరు

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫల మవుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ అన్నారు.మహిళలపై హింస,దాడులు నిత్యకత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.తుళ్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం రాజధాని ఐద్వా రెండవ మహాసభ జరిగింది.సభలో అరుణ మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా,ఆర్థికంగా, కుటుంబ పరంగా మహిళలు నిత్యం వివక్ష, వేధింపులకు గురవుతున్నారని అన్నారు.వరకట్నం కోసం హత్యలు, ప్రేమ పేరుతో వంచన,మరణాలు,అత్యాచారాలు,గహహింస, సైబర్ మోసాలు,కిడ్నాప్,కుల దురహంకార హత్యలు నానాటికీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.చట్టం ముందు అందరూ సమానమని, చట్టం అందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించాలని పేర్కొన్న ప్పటికీ మహిళల రక్షణ లో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయన్నారు.దేశంలో సగటున ప్రతి గంటకు 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయని, ప్రతి 77 నిమిషాలకు ఒక వరకట్న హత్య,48 నిమిషాలకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విద్య, ఉద్యోగ,సమాన వేతనాలు అందుబాటులో లేకుండా సమానత్వం అసాధ్యమని అన్నారు.మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మగవారితో పాటు సమానంగా అవకాశాలు కల్పించినప్పుడే అణిచివేత అంతమవుతుందని అన్నారు.వాగ్దానాలు,ప్రకటనలతో సమానత్వం రాదన్నారు. ఎన్నోపోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగంలో మహిళలకు అనేక హక్కులు కల్పించబడ్డాయని అన్నారు.మద్యం,గంజాయి,పోర్న్ వెబ్ సైట్స్ మహిళలపై హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయని, స్త్రీల శరీరాలను పెట్టుబడిదారులు వ్యాపార వస్తువులుగా మార్చారని అన్నారు.ధరల పెరుగుదల కారణంగా అనేక పేద కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని చెప్పారు .మహిళలు ఇంటా, బయట ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహిళా సంఘం అండతో సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.తొలుత మహిళా సంఘం జెండాను పులి వీరమ్మ ఆవిష్కరించారు.అనంతరం 25 మందితో అఖిల భారత మహిళా సంఘం రాజధాని డివిజన్ నూతనకమిటీ ఎన్నికయింది. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా లేళ్ల సుఖవేణి,కుక్కమళ్ళ బ్యూలా ఎన్నికయ్యారు.సమావేశంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి,ఎం భాగ్యరాజు,రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు చెరుకూరి సుశీల,మహిళా సంఘం నాయకురాలు చేవూరి నందాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహిళా సంఘం (ఐద్వా) గుంటూరు జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ


కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా లేళ్ల సుఖవేణి,కుక్కమళ్ల బ్యూలా

పన్ను వసూలు చేస్తున్నారు..పరిశుభ్రత ఏది?

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో చెత్త పన్ను వసూలు చేస్తున్నారు కాని దానికి తగిన రీతిలో పారిశుధ్యం మెరుగుపరచటంలేదని పట్టణ పరిసరప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరరావు అన్నారు. స్థానిక దేవీ చౌక్ నుంచి గురవయ్య కాలనీ రోడ్డుకు ఎడమవైపున్న కాలువను బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో క్లీనింగ్‌కు అనుకూలంగా రెండు వైపులా కాళీ స్థలం ఉండేదన్నారు. కాలక్రమంలో ఆక్రమణలకు గురైందని, ఫలితంగా కాలువలో షిల్టు తీయటం మానేశారన్నారు. పట్టణంలో ప్రధాన డ్రెయిన్లు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయన్నారు. తీవ్రమైన దర్గంధం, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారని, తక్షణమే కాలువలో షిల్టు తీసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మదేవర వెంకటేశ్వరరావు, రావూరి శంకరరావు, నారాయణం కమల్‌కుమార్, వాకా పేరిరెడ్డి, మాచిరాజు కృష్ణమూర్తి, బిఎల్ రాజేంద్రప్రసాద్, అబ్దుల్ ఆరిఫ్, బాలకృష్ణనాయక్, చైతన్య, శివరామయ్య పాల్గొన్నారు.



కొత్తపల్లి సుధాబాలకు నివాళి

ప్రజాశక్తి-తెనాలి: జన సాహితీ, ప్రజాసాహితీ సంస్థలకు కొత్తపల్లి సుధాబాల అత్యంత ఆత్మీయులని జనసాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు దివి కుమార్ అన్నారు. ప్రజా సాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు సతీమణి సుధాబాల సంస్మరణ సభ స్థానిక ఈటి కాలనీలో ఆదివారం నిర్వహించారు. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో దివికుమార్ మాట్లాడుతూ సుధాబాల సమాజంపై ఎంతో అవగాహన కలిగిన మహిళగా బాధ్యతగా వ్యవహరించారన్నారు. ఆమె మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు వితరణ చేయటం విశేషమన్నారు. ప్రజాసాహితి సంపాదకులు మధుబాబుకు ఆమె ఎంతో సహకారాన్ని అందించారన్నారు. తొలుత వారంతా సుభాబాల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవిబాబు, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.


2కె నడకను ప్రారంభిస్తున్న డాక్టర్ కోటినాగయ్య

కొలకలూరులో 2కె వాక్

ప్రజాశక్తి-తెనాలి: రూరల్ గ్రామం కొలకలూరులో డాక్టర్ యడ్ల కాళిప్రసాద్ స్మారకంగా ఆదివారం 2కె వాక్ నిర్వహించారు. తెనాలికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జె.కోటి నాగయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిఎస్టీ డిప్యూటి కమిషనర్ (తెలంగాణా) యడ్ల శ్రీలీల, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి(నెల్లూరు) యడ్ల శ్రీచందన, స్థానిక విద్యార్థులు, యువకులతో కలిసి బాపయ్యపేట నుంచి రైల్వే స్టేషన్ వంతెన వరకూ నడకను కొనసాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటినాగయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నడక ఆరోగ్యానికి దివ్య ఔషదంగా చెప్పారు. శ్రీలీల మాట్లాడుతూ తన తండ్రి కాళి ప్రసాద్ వైద్యులుగా పనిచేశారన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఆయన వర్ధంతి సందర్భంగా ఆరోగ్యపరమైన అవగాహన కల్పించేందుకు 2కె వాక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిఈటీలు నాగయ్య, ఎస్.వినయ్‌కుమార్, ఎస్.అంబేద్కర్,కె. మోజెస్ పర్యవేక్షించారు. న్యాయవాది ఎస్.మురళీధర్,వై.రవికిరణ్, కె.సుదర్శన్, శ్రీధర్ పాల్గొన్నారు.

బాలోత్సవం రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న బాలోత్సవం రిజిస్ట్రేషన్ పొడిగించినట్లు గుంటూరు బాలోత్సవం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పొడిగించనట్లు చెప్పారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి ప్రవేశ రుసుమూ లేదని తెలిపారు. ఇతర వివరాల కోసం 9703579996 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల సమస్యపై పల్నాడు కలెక్టరేట్ వద్ద నేడు ధర్నా

జయప్రదం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి - వినుకొండ

జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదార్లకు ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, టిడ్కో ఇళ్లను వెంటనే అందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై పల్నాడు కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేదా ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ప్రచారంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పివి సురేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బి. శ్రీనివాసరావు, యు.రాము, సాంబయ్య, అఖిల్, సాగర్, మస్తాన్, మల్లికార్జున, పుల్లయ్య పాల్గొన్నారు.


వినుకొండలో ప్రచారం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన ప్రచారంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడారు. జి.హర్ష, యు.రాజు, సుభాని, నాగూర్‌వలి, కోటి పాల్గొన్నారు.

మున్సిపల్-పోలీస్ జట్ల మధ్య ఉత్కంఠ మ్యాచ్

- ఒక్క పరుగు తేడాతో విజయం సాధించిన మున్సిపల్ జట్టు
- రమణకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మున్సిపల్, పోలీసు శాఖ ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠగా సాగగా ఒక్క పరుగు తేడాతో మున్సిపల్ జట్టు విజయం సాధించింది. స్థానిక పురుషోత్తపట్నంలోని మైదానంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన మున్సిపల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లకు గాను 10 ఓవర్లకే మొత్తం వికెట్లు కోల్పోయిన మున్సిపల్ జట్టు 66 పరుగులు చేసింది. షేక్ ఇస్మాయిల్ 14 పరుగులు చేయగా రమణ 12 రన్స్ చేశారు. ఎస్ఐ ఫిరోజ్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన పోలీసు జట్టు తొలుత ధీటుగానే ఆడినా చివర్లో కష్టాల్లో పడింది. మున్సిపల్ జట్టులోని రమణ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పోలీస్ జట్టును కట్టడి చేశారు. అయినా చివరి వరకూ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. చివరి రెండు ఓవర్లలో 7 రన్స్ కొట్టాల్సి ఉండగా 11 ఓవర్ బౌలింగ్ చేసిన రమణ ఐదు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీయడంతో 65 పరుగులకు పోలీస్ జట్టు ఆలౌటైంది. దీంతో మున్సిపల్ జట్టు విజేతగా నిలిచింది. పోలీస్ జట్టులో కానిస్టేబుల్ శివప్రసాద్ అత్యధికంగా 17 పరుగులు చేయగా, ఎస్ఐ ఫిరోజ్ 11 రన్స్ చేశారు. మున్సిపల్ జట్టులో తక్కువ బాళ్లకు ఎక్కువ రన్స్ చేయడంతోపాటు బౌలింగ్‌లోనూ ప్రతిభ చూపిన రమణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు మాట్లాడుతు క్రీడల వల్ల మానసిక ఉత్సాహం కలుగుతుందన్నారు. రానున్న రోజుల్లో పట్టణంలోని పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, చెస్, కబడ్డీ తతదిర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. సిఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ తరహాలో ఫ్రెండ్లీ క్రీడల వల్ల ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గి మరింత మెరుగ్గా పని చేస్తారన్నారు.


విజేతలకు బహుమతిని అందిస్తున్న సిఐ రాజేశ్వరరావు

సొసైటీలకు అనుబంధంగా గిడ్డంగులు

- నాబార్డు ఆర్థిక సహకారంతో నిర్మాణం
- ఆర్‌బికెలకు అనుసంధానంతో మల్టీపర్పస్‌గా వినియోగం
- 275 కేంద్రాల్లో జగనన్న పాలవెల్లువ
- ప్రజాశక్తితో పల్నాడు డిసిఒ నాగశ్రీనివాస్



సహకార సంఘాలకు అనుబంధంగా వ్యవసాయ అనుబంధ వ్యాపార లావాదేవీలు నిర్వహణకు వీలుగా గిడ్డంగులు నిర్మిస్తున్నట్టు సహకార శాఖ పల్నాడు జిల్లా అధికారి ఉదయగిరి నాగశ్రీనివాస్ తెలిపారు. నాబార్డు రుణంతో గిడ్డంగుల నిర్మాణం జరుగుతోందని, దశలవారీగా అన్ని సొసైటీలకు అనుబంధంగా గిడ్డంగులు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.



పల్నాడు జిల్లాలో ఎన్ని గిడ్డంగులు నిర్మిస్తున్నారు?

500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగినవి రూ.40 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగినవి రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. తొలి దశలో 50 గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదించాం. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న వాటికి 32 సెంట్లు, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన వాటికి 50 సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయిస్తుంది. 50 నిర్మాణానికి ప్రతిపాదించగా 45 చోట్ల నిర్మాణం ప్రారంభమైంది. 8 గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటి నిర్మాణాన్ని మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం చేపట్టింది. రెండో దశలో 36 ప్రతిపాదించగా 35 మంజూరయ్యాయి. మూడో దశలో 67 గిడ్డంగులకు ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకు ఏడు చోట్ల భూమి గుర్తించాం.

ఒక్కో సొసైటీ పరిధిలో ఎన్ని గిడ్డంగులు కేటాయించారు?

జిల్లాలో 59 సహకార సంఘాలున్నాయి. ఇప్పటికే కొన్ని సంఘాలకు అనుబంధంగా గిడ్డంగులున్నాయి. కొన్ని సంఘాల పరిధిలో గిడ్డంగులు లేనిచోట మంజూరు చేస్తున్నారు. జిల్లాలో మూడు దశలో ఆర్‌బికెల పరిధిలో గిడ్డంగుల్లేని గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేస్తున్నారు. ఒక్కో సొసైటీ పరిధిలో మూడు నుంచి నాలుగు గిడ్డంగులు ఉండవచ్చు. ఈ గిడ్డంగులు ఆర్‌బికెకు అనుబంధంగా పని చేస్తాయి. మూడు దశల్లో 153 గిడ్డంగులు మంజూరయ్యాయి.

గిడ్డంగులలో ఏయే ఉత్పత్తులు నిల్వ చేస్తారు?

ఆర్‌బికెల ద్వారా రైతులకు సరఫరా చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ చేస్తారు. వీటితో పాటు వ్యవసాయ ఉత్పత్తులనూ నిల్వ చేస్తారు. సహకార సంఘాల తీర్మానంతో రైతులకు సంబంధించి ఉత్పత్తులు కూడా నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

నాబార్డు రుణం తిరిగి ఎలా చెల్లించాలి?

నాబార్డు రుణం 500 టన్నుల గిడ్డంగులకు రూ.40 లక్షలు, వెయ్యి టన్నుల వాటికి రూ. 75 లక్షలతో నిర్మాణం చేపడతారు. 4 శాతం వడ్డీతో రుణాన్ని నిర్దేశిత కాలపరిమితిలో చెల్లించిన సంఘాలకు మూడు శాతం వడ్డీ రాయితీకి నాబార్డు అంగీకరించింది. సకాలంలో చెల్లించకపోతే నాలుగు శాతం వడ్డీచెల్లించాలి. ఈ మొత్తం రుణం సహకార సంఘాలే చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

జగనన్న పాలవెల్లువ ఎన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు?

పల్నాడు జిల్లా పరిధిలో 275 కేంద్రాల పరిధిలో పాల సేకరణ జరుగుతోంది. వీటితో మహిళా సహకార డెయిరీలు 101 ఏర్పాటు చేస్తున్నాం. పాల సేకరణలో రాష్ట్రంలో పల్నాడు జిల్లా రెండో స్థానంలో ఉంది.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఏటి అగ్రహారంలో సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేలోగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని జిఎంసి అధికార యంత్రాంగానికి కాలనీ అభివృద్ధి వేదిక విజ్ఞప్తి చేసింది. స్థానిక ఏటి అగ్రహారం 8వ లైనులోని శ్రీశంతన్ హైస్కూల్ ఆవరణలో అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సమావేశం రిటైర్డ్ ఇంజినీర్ ఎమ్‌డి.అక్బర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రొఫెసర్ సివిపిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిందని, ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని తెలిపారు. దయనీయంగా ఉన్న రోడ్ల వల్ల దుమ్ము, కాలుష్యంతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు మహిళలు, వృద్ధులు, తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనులు మరింత జాప్యమయ్యే పరిస్థితి కనిస్తున్నందున గుంతలు పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని కోరారు. శంతన్ హైస్కూల్ గౌరవ డైరెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతం అశుభ్రంగా ఉందని, బ్రిడ్జి లోపల వైపు లైట్లు వెలగట్లేదని, ఏటి అగ్రహారం ప్రాంతంలో వీధి కుక్కల బెడత తీవ్రంగా ఉందని అన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వివిధ రంగాలు, సంస్థల తరపున సిహెచ్.ప్రమీల, వివికె.సురేష్, ఎం.కోటేశ్వరరావు, పి.విజయ్‌కుమార్, బి.హైమానంద్, పి.వి.లక్ష్మీనారాయణ, సిహెచ్.గోపాలకృష్ణ, వి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ధిక్కార కవులు - దళిత బహుజనతత్వంపై 11న సభ

ప్రజాశక్తి-గుంటూరు : తెలుగు సాహిత్య చరిత్రలో ధిక్కార కవులుగా కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్‌బాబు నిలిచిపోతారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్‌బాబు-దళిత బహుజన తత్వం' అంశంపై ఈనెల 11న సాయంత్రం 5 గంటలకు స్థానిక బ్రాడీపేటలోని



గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సభ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పత్రాలను బ్రాడీపేటలోని మద్రాస్ కాఫీ హోటల్ వద్ద ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్, కవులు ఎస్ఎం.సుభానీ, చంద్రపాల్, శ్యాంబాబు, కడియం జేమ్స్, బి.సురేష్‌బాబు, న్యాయవాది సంజీవరెడ్డి పాల్గొన్నారు.


నరసరావుపేటలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య

పల్నాడులో 14 కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష

3,180 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జాతీయ ప్రతిభ అన్వేషణ (ఎన్ఎంఎంఎస్) 2023 ప్రవేశ పరీక్షలను పల్నాడు జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపే టలోని జెడ్‌పి పాఠశాల, ఎస్‌బి పురం, మున్సిపల్ బాలుర హైస్కూల్, మున్సిపల్ బాలికల హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాలను డిఇఒ ఎం.వెంకటప్పయ్య సందర్శించారు. నరసరావుపేట పట్టణంలో 6 సెంటర్లలో, సత్తెనపల్లిలో 4 సెంటర్లలో, గురజాలలో 4 సెంటర్లలో పరీక్షలు నిర్వహించినట్లు డిఇఒ తెలిపారు. పరీక్షలకు 3,180 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొగా 3,066 మంది హాజరయ్యారని చెప్పారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహించామన్నారు.